# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 7, అక్టోబరు, 2014

దళిత వాడల నుండి దారిద్ర్యాన్ని తరిమి కొట్టాలనే లక్ష్యంతో చేపట్టిన దళితులకు మూడెకరాల భూపంపిణీ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు జిల్లా కలెక్టర్లు సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కోరారు. సచివాలయంలో మంగళవారం జరిగిన కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి దళితుల భూ పంపిణీ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పథకానికి తాను ఎంతో ఇష్టపడి రూపకల్పన చేశానని, ముఖ్యమంత్రిగా, వ్యక్తిగతంగా కూడా ఈ పథకం తనకు సవాలని ముఖ్యమంత్రి ప్రకటించారు. దళితుల భూపంపిణీ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపడతామని చెప్పారు. బడ్జెట్‌లో కేటాయింపులు జరిపి వచ్చే ఏడాది నుండి మరింత ఉధృతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఈ పథకం కోసం పెద్ద ఎత్తున భూమి కొనుగోలు చేయాల్సి వుందని, ఇందుకోసం ఎక్కడ భూమి దొరికినా వెంటనే కొనాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఎన్ఆర్ఐలకు, హైదరాబాద్ లాంటి నగరాల్లో స్థిరపడిన వారికి, వ్యాపారులకు కూడా గ్రామాల్లో భూములు వున్నాయని, అవన్ని నిరుపయోగంగా పడి వున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. భూమి ఉత్పత్తి సాధనం కాబట్టి అది వృధాగా వుండవద్దని, ఆ భూమిని ప్రభుత్వానికి అమ్ముకుంటే మంచి ధర ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కలెక్టర్లు కూడా ఈలాంటి భూములు, వ్యక్తులను గుర్తించి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయాలని వెల్లడించారు. నిరుపేద దళిత కుటుంబానికి మూడెకరాల భూమి వుండాలన్నది తన లక్ష్యమని, ఆ భూమిలో లాభసాటి వ్యవసాయం చేసి దళిత కుటుంబాలు ఆర్థికంగా బాగుపడ్డప్పుడే తనకు తృప్తి వుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. మూడెకరాలకు ఎంత తక్కువ భూమి వుంటే అంత భూమి ప్రభుత్వం కొనివ్వాలని, అసలే భూమి లేకుంటే మొత్తం మూడెకరాలు ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చెప్పారు. దళితులకు ఇచ్చిన భూమిలో బోరు, మోటారు, కరెంట్ కనెక్షన్ కూడా ప్రభుత్వ ఖర్చులతోనే సమకూర్చాలని వెల్లడించారు. ఆ భూముల్లో భూసార పరీక్షలు

నిర్వహించాలని, భూగర్భ జలాలను పరీక్షించాలని, వాటి ఫలితాలను బట్టే ఏ భూమిలో ఏ పంట వేయాలనే విషయంలో రైతులకు సూచనలు చేయాలని చెప్పారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు దళితులకు ఇచ్చిన భూములను పరిశీలించి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు కూడా ప్రతి మూడు నెలలకొకసారి ఈ భూముల్లో ఏమి జరుగుతుందో తెలుసుకోవాలని, రైతులకు సూచనలు చేయాలని వారికేమయినా సమస్యలుంటే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. తాను కూడా జిల్లాల్లో పర్యటనలు జరిపే సందర్భంగా తప్పక దళితులకు ఇచ్చిన భూమిని సందర్శిస్తానని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల కుటుంబాల్లో వెలుగు చూడాలనుకుంటున్నానని ముఖ్యమంత్రి ప్రకటించారు. దేశానికి ఎంతో సేవ చేసిన దళితులకు ప్రభుత్వం ఇప్పుడు సేవ చేయాలని నిర్ణయించుకున్నదని చెప్పారు. దేశం సొమ్మంతా దళితులకే దోచి పెట్టినట్లుగా ప్రచారం జరిగింది తప్ప నిజానికి దళితులకు మేలు కలుగలేదన్నారు. ఇంకా 90 శాతం మంది దళితులు పేదరికంలోనే మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్లు, ఇతర అధికారులు కూడా దళితులను ఆర్థికంగా బాగు చేసి వృత్తి పరమైన తృప్తి పొందాలని కోరారు.

---

సిపిఆర్ఓ టు సిఎం